

# డాక్టర్ చెప్పిన కథలు

## - డా.శైలజ చందు



## – 21 –

'గాడిదా' అన్న పిలుపు ఎంత బాగుంటుంది.

నన్ను అలా అనగలిగిన ఒకే వ్యక్తి వల్లిగారు.

ఆమె మొదటి సారి 'నోర్మూసుకో గాడిదా' అన్నపుడు

నేను తలవంచుకుని సిగ్గుతో నవ్వుకున్నాను.

"నవ్వితే ఎంత ముచ్చటగా ఉంటావే. ఎప్పుడూ మూతి ముడుకుని ఉంటావెందుకు? నువ్వేకాదు. మీ డాక్టర్లెప్పుడూ కొంపలు ముంచుకుపోయినట్టు ముఖాలలా బిగదీసుకుంటారేమిటే?"

"లేదండీ, చక్కగా నవ్వుతూనే ఉంటామే!"

"నీ తలకాయ. లోకంలో మేమే గొప్పవాళ్ళం  అన్నట్టు నడుస్తుంటారు. వెధవ అతిశయం, మీరూనూ."

ఆవిడ తిడుతుంటే కోపం రాదు. సంతోషం కమ్ముతుంది.

మా ఇద్దరి స్నేహం స్వేచ్ఛగా పెరిగిన అడివిలో వృక్షం లాగా అయింది. ఇంతకూ వల్లిగారెవరో మీకు తెలియదు కదా.

మా జయ వాళ్ళ అమ్మగారు.

***

జయ నా సీనియర్ అసిస్టెంట్.

క్రితం ఏడాది నేను డిపార్ట్ మెంట్ హెడ్ గా చార్జ్ తీసుకున్నపుడు , ఆ హాస్పిటల్ డైరెక్టర్ తో సహా అందరూ ఎక్కువగా భయపెట్టింది జయ గురించే.

పోట్లాడుతుందనీ,

రాజకీయాలు చేస్తుందనీ.

బద్ధకస్తురాలనీ.

ఒకటి కాదు.

సరే చూద్దాం అనుకున్నాను.

మడుగులో దిగాలనుకున్నపుడు, బట్టలు మాసిపోతాయని భయపడితే కుదరదు కదా.

మొదటి నెల డ్యూటీ రోస్టర్ వెయ్యగానే , నా రూం లోపలికి వచ్చింది.

మామూలుగా రాలేదు.దూసుకుని వచ్చిందంటారే. అలా వచ్చింది.

కూర్చోమన్నాను.

అక్కర్లేదని నిలబడే "ఇలా అయితే ఎలా మేడం." డ్యూటీ ప్లానర్ పేపర్ నా కళ్ళముందు ఆడిస్తూ అడిగింది.

"ఏమైంది?"

"పండగ సెలవల్లో నాకు డ్యూటీ వేశారు. తర్వాత వీకెండ్ , మొత్తం మూడు రోజులు, హాస్పిటల్ లోనే ఉండాలా?"

"పండగెప్పుడూ?"

చెప్పకుండా మౌనంగా ఉంది.

"చెప్పండి. పండగెప్పుడూ?" అని పేపర్ తన ముందు పెట్టాను.

"మీకు తెలియదా?"

"తెలియదు. నేను పండగలు చెయ్యను."

ఆ మూడు రోజులూ చూపించింది.

"ఒక పని చేద్దాం. ఆ రోజుల్లో నేను డ్యూటీ చేస్తాను. సరేనా."

వెటకారంతో మాట్లాడుతున్నానని అనుకుంది.

"ఛీఫ్ లు డ్యూటీలు చేస్తారా? అందరి పైనా హెడ్ మీరు." ఆశ్చర్యంలో వెటకారం.

"చివరివాడి పని కూడా చెయ్యడానికి సిద్ధ పడేవాడినే హెడ్ అంటారు."

ఆ తర్వాత బాస్ కూ, సబార్డినేట్ కూ మామూలుగా ఉండే సంబంధాన్ని కొద్దిగా చెరిపాను. ఇద్దరం ఒకే వయసు కావడం కూడా కలిసొచ్చింది.

జయ భర్త, లాబొరేటరీ ఇన్ చార్జ్ గా మా హాస్పిటల్ లోనే చేసేవాడు.

ఇంటికెళ్ళాక తనలోకం లో తను బతుకుతాడట. ఆ బద్ధకపు స్వర్గలోకం లోకి , అత్యవసరమైన పరిస్థితుల్లో తప్ప వెళ్ళకూడదని ఒక రూల్. ఆ రూల్ అతిక్రమించని పతివ్రత జయ.

నాకు తెలిసిన ఆడవాళ్ళలో 'జయ' మహా ఇల్లాలని రాసిచ్చేస్తాను.

భర్తని ఎంత ముద్దు చెయ్యాలో తన దగ్గరే నేర్చుకోవాలి.

హాస్పిటల్ లో కూడా భర్త సేవలకు లోటు రానిచ్చేది కాదు.

పదకొండయే సరికి అమృతాహారపు డబ్బా పట్టుకుని పరుగు తీసేది. ఎప్పుడూ కాంటీన్ లో చేతికందినవి తినేసి ఆరోగ్యం పాడు చేసుకునే అతనికి ,ఆరోగ్యమైన తిండి అందించాలి కదా.

జయకు ఒక కూతురుంది. స్కూల్ టాపర్. ఆట పాటల్లో కూడా ముందేనట. ఆ పాప కెరియర్ కోసం ఆమె చాలా శ్రద్ధ పెట్టేది.

హాస్పిటల్ పని అయ్యాక రెండు మూడు గంటల పాటు పాపని స్పోర్ట్స్ క్లాసెస్ కూ, మ్యూజిక్ క్లాసెస్ కూ తీసుకుని వెళ్ళాలి. తన డ్యూటీ రోజున ఆ మూడుగంటలు కవర్ చెయ్యడానికి , డిపార్ట్ మెంట్ లో ఎవరూ ముందుకొచ్చేవాళ్ళు కాదు.

ఛీఫ్ గా నాకు డ్యూటీలుండవుగనక ఆ మూడు గంటలూ నేను కవర్ చేస్తానన్నాను.

తనకే పని సానుకూలం కావాలన్నా, యుద్ధాలు చేయక్కర్లేదని ఆమెకు అర్థం అయేసరికి రెండు మూడు వారాలు పట్టింది.

నేను చేసే సహాయానికి బదులుగా, నాకిష్టం లేని గాసిప్స్, రాజకీయాలు తగ్గించింది.

ఒక సారి ఆ కొత్త ఊళ్ళో మాల్ కు, షాపింగ్ చేద్దామని వెళ్ళాను.

మాల్ లో షాపింగ్ చెయ్యాలంటే చాలా నేర్పు ఉండాలి. లోపలికి వెళ్ళగానే నేను అయోమయానికి గురి అవుతాను.

డిప్రెషన్ మొదలై, అందులోనుండి కొన్ని వేదాంతపరమైన ప్రశ్నలు వస్తాయి.

'నేను ఎందుకొచ్చాను, నా లక్ష్యం ఏమిటి? గమనం ఎటు వైపు. గమ్యం ఏమిటి?' లాంటి ప్రశ్నలు

దానికి తోడు నా ట్రాలీ బండికెప్పుడూ మూడు చక్రాలే పనిచేస్తుంటాయి. సామరస్యం లేని సంసారం లా నేనొక వైపు తోస్తుంటే అది ఇంకోవైపు వెళ్తూ వుంటుంది.

'ఛీ...ఈ షాపింగ్ నా వల్లకాదబ్బా' అని ఎవరిమీదో గట్టిగా విసుక్కుని, ఒక చోట ఆగి, కాఫీ మగ్గుల షోకులు చూస్తూ ఉన్నాను.

'హాయ్' అన్న పలకరింపు వినిపిస్తే వెనక్కి తిరిగి చూశాను. .

జయ నిలబడి ఉంది. పక్కనే పన్నెండేళ్ళ పాప , ఇంకో పెద్దావిడ.

అమాయకత్వమే పాప లాగా నిలబడి ఉంది. చదువు, విజయాలు తప్ప ఇంకోటి ఎరగని అమాయకత. బుగ్గ పట్టుకుంటే , బంగారు గులాబీలు మాసిపోతాయని గడ్డం పట్టుకుని

"జయా, మీ పాపా?" అని అడుగుతుంటే పక్కనే ఉన్నావిడ నా వంకే చూస్తున్నారు.

నేను కూడా చూశాను. బాగా చదువుకున్న స్త్రీ లాగా ఉంది . లేత కనకాంబరపు జరీ చీరలో బంగారపు ఛాయలో మెరిసిపోతోంది. జయకూ, ఆమెకూ పోలికలే లేవు.

'జయకు ఏమవుతారో?' అనుకుంటూ ఉండగానే

"అమ్మా, మా ఛీఫ్" అని పరిచయం చేసింది.

నేను నమస్తే చెప్పడానికి చేతిలో ఉన్న కాఫీ మగ్ పక్కనే పెట్టాను.

ఆవిడ నా చెయ్యందుకుని

"ఛీఫ్ అంటే ఎవరో పెద్దావిడ అనుకున్నాను" అన్నారు

నేను జీన్స్, నలిగిన చొక్కాలో వున్నందుకు మొహమాటంగా అనిపించింది.

"మీరెక్కడ నుండి వచ్చారు?" సంభాషణ ఇంగ్లీషులో జరుగుతోంది.

"తెలుగమ్మాయే" అన్నది జయ.

జయ చాలా సార్లు వాళ్ళింటికి రమ్మని ఆహ్వానించింది కానీ వెళ్ళడానికి ఇష్టపడేదాన్ని కాదు. ఆమెతో స్నేహం వద్దని మనసు దాట వేస్తుండేది.

"ఇవాళ పాప పుట్టిన రోజు. మిమ్మల్ని తీసుకురమ్మని మరీ మరీ చెప్పింది అమ్మ" అని ఓ రోజు పట్టుబడితే వెళ్ళాను.

కారు దిగగానే ఇంటివైపు చూశాను.

పాత బ్రిటీష్ కట్టడాలకు వాడే రాళ్ళు వాడారు. ఆ రాళ్ళమీద ఎక్కడ చూసినా బతానీ తీగెలు, ఇంకా ఏవో లతలు పాకి ఉన్నాయి.

ఆ ఇంటి బయట రాతి పలక మీద తెలుగులో 'వల్లి' అని రాసి ఉంది. పేరు పైకి చదివి జయవంక చూశాను.

"అమ్మ పేరు. అదే ఇంటి పేరు."

'వల్లి–గార్డెన్ హౌస్' అని మనసులో నేనొక సొంత పేరు పెట్టేశాను.

జయ చెప్తే తెలిసిన విషయాలేమిటంటే, ఆమె మేథమేటిక్స్ ప్రొఫెసర్. ఆడపిల్లల కాలేజ్ కి ప్రిన్సిపాల్ గా చేసి రిటైర్ అయ్యారు. ఆమె సొంత డిజైన్ తో కట్టుకున్న ఇల్లట.

లోపలికి వెళ్ళగానే ఇల్లింత విశాలంగా ఉందేమిటి అనిపించింది.

నేను తప్ప ఎవరూ గెస్టులు కనిపించకపోయేసరికి "పార్టీ హడావుడి ఏమీ లేదే?" అడిగాను.

"రాత్రి ఎప్పుడో అయిపోయింది. మీరు వచ్చే పార్టీ కాదని పిలవలేదు. లంచ్ మీకొక్కదానికే" అంది జయ.

హాల్లో షోకేస్ లు, అందులో చిత్తువత్తుగా ఇరికించబడ్డ మీనియేచర్ సామాగ్రి , కుటుంబ చరిత్ర వివరించే ఫోటోలు ఇవేమీ కనిపించలేదు. శూలాలు, బల్లేలు పట్టుకుని భీకరంగా మనవంకే చూసే బొమ్మలు లేవు. కనీసం పూసల గవ్వల కర్టెన్లు లేవు.

టీవీ ఎక్కడ ఉన్నదో తెలియలేదు. అన్నిటినీ మించి హాల్లో నుండి కిచెన్ కనపడలేదు. ఇల్లు అనేందుకు , హాల్లో ఒక్క సింకు కూడా కనిపించలేదు.

గోడకు ఆనించి ఉన్నాయనిపించే వెడల్పైన సోఫాలు, అందులో కుషన్లు. సోఫాల మధ్య తెల్లని వేజ్ లో తాజా పూలు. గోడకమర్చిన రెండు బుక్ షెల్ఫులున్నాయి.

లివింగ్ రూం గోడ మీద కంటికి శ్రమ కలిగించని రంగుల్లో ఒక విశాలమైన పెయింటింగ్. ఎక్కువసేపు చూస్తే తనలోకి లాగేస్తుందేమో!

అటూ ఇటూ చూశాను.

ముదురు బ్రౌన్ రంగులో, రెండు పెద్ద పెద్ద కూజాలున్నాయి. అందులో తెల్లని కాండపు ముదురాకుల చెట్లున్నాయి.

నాకన్నింటికన్నా నచ్చింది పెద్ద కూజా లో ఉన్న విరగబూసిన పసుపు పూల చెట్టు.

ఊపిరికి సంకెళ్ళు తెగిపోయాయి.

దాని దగ్గరకు వెళ్ళి నుంచున్నాను. పక్కనే ఎవరో ఉన్నట్టనిపించి చూస్తే లేతాకుపచ్చ జరీ చీరలో వల్లిగారు నిలబడి ఉన్నారు.

నేను నమస్తే చెప్పబోయేంతలో,"ఎన్నాళ్ళనుండో అడుగుతున్నాను జయని, నిన్ను తీసుకురమ్మని ." అంటూ చెయ్యి పట్టుకున్నారు.

"నన్నా?"

"మా జయ ఈ మధ్య శాంతంగా ఉంటోంది. ఆ కారణమేమిటో తెలుసుకుందామని." నవ్వారు.

"ఇప్పటికే లేటయ్యింది. లంచ్ చేద్దాం రండి" అంటూ హాలునానుకుని ఉన్న ఒక కారిడార్ వైపు తీసుకెళ్ళారు.

కారిడార్ లో చతురస్రాకారపు రాతి రాళ్ళు పరచి ఉన్నాయి. రాళ్ళ మధ్య పచ్చిక. కొద్ది దూరంలో భోజనాల గది. దానికి ఆనుకుని ఉన్న కిచెన్. వంటింట్లో ఇద్దరు మగవాళ్ళు పని చేస్తున్నారు. ఎటు పక్కకు వెళ్ళినా మామూలు ఇళ్ళ ఫార్మాట్ లో ఆ ఇల్లు, పరిసరాలు ఇమడకపోవడం విచిత్రంగా ఉంది.

లంచ్ చేస్తూ ఉంటే , జయ కు కాల్ హాస్పిటల్ నుండి కాల్ వచ్చింది. హడావుడిగా తినేసి వెళ్ళింది.

భోజనం అయాక వల్లిగారు , నన్ను తన గదిలోకి తీసుకెళ్ళారు.

ఆవిడ ఏవో కబుర్లు చెప్తుంటే, చూస్తుండగానే చీకటి పడిపోయింది.

రాత్రి భోజనం అయ్యాక వెళ్ళమన్నారు.

నేను రాత్రిపూట తినననని చెప్తే కాఫీ తెచ్చారు.

మగ్ చూడగానే 'తెల్లని శంఖం లా ఉన్నదే' అనిపించి అటు తిప్పి, ఇటు తిప్పి దాని వంకే చూస్తున్నాను.

"నచ్చిందా?"

అవునన్నట్టు తలూపాను.

"నిన్ను మొదటి సారి మాల్ లో చూసినపుడు , నువ్వు ఈ మగ్ నే చూస్తూ ఉన్నావు. అప్పుడు కొన్నాను. నీ కోసమే దాచాను."

కొంత మందికి, 'మనుషుల్ని సంతోషపెట్టడం' అనే హాబీ ఉంటుంది.

జయ తరచూ వాళ్ళింటికి తీసుకెళ్ళేది. కానీ కూతురి కెరియర్ కోసం తీసే పరుగుల వల్ల , నేను , వల్లిగారే ఎక్కువగా మాట్లాడుకునేవాళ్ళం.

ఆమె గది ఇంటికి వెనక వైపుండేది. ఒక లివింగ్ రూం అంత విశాలంగా ఉండేది. పలుచని తెల్లని జలపాతాల్లాంటి కిటికీ తెరలు. కిటికీలకే కాదు, ఆమె బెడ్ కు కూడా అవే . గదిలో ఒక మూల బల్ల మీద గాజు వేజ్ లో గులాబీలుండేవి. నేను వెళ్ళిన ప్రతిసారీ, ఆ వేజ్ లో పూల రంగు మారుతూ ఉండేది. ఎప్పుడూ లేత రంగు గులాబీలే.

గదిలో ఏదైనా సరే చక్కగా సర్ది ఉండేది. ఎటు చూసినా శుభ్రత .

ఆమె గది బయట ఒక చిన్న ఉడెన్ ఫ్లోర్ వరండా ఉంది. అక్కడక్కడా, చక్కటి పూల చెట్ల కుండీలు. చామంతులని, బంతి పూలని మాత్రమే గుర్తుపట్టాను.

ఆమెతోనే కాదు, ఆ గదితో కూడా నాకు స్నేహం పెరిగింది.

కిటికీ పక్కనే తెల్లని కౌచ్ ఉండేది. దాన్ని దీవాన్ అనీ అనలేము. సోఫా అనీ అనలేము. అందులో పసుపు రంగు, ముదురు గులాబి రంగుల్లో కుషన్స్ ఉండేవి.

నేను కూర్చునేది కూడా అక్కడే. మొదట్లో ఒక ప్రొఫెషనల్ లా పద్ధతిగా కూర్చునేదాన్ని.

మా స్నేహం పెరిగాక , కాళ్ళు పైకి పెట్టుకుని , కుషన్స్ వళ్ళో పెట్టుకుని వల్లిగారి మాటలు వినేదాన్ని.

పక్కనే ఉన్న కిటికీ నుండి చూస్తే వాళ్ళ తోట కనిపిస్తుంది. ముదురాకు పచ్చని కరివేపాకు చెట్టు. పక్కనే గులాబి రంగు పూలు పూసే దట్టమైన పొద లాంటి చెట్టు. దాని పేరేమిటో నాకు తెలియదు. ఆ చెట్టు కింద సిమెంట్ బెంచ్ ఉంటుంది.

రాత్రిపూట ఆ బెంచి మీద కూర్చోబెట్టి భోజనం అక్కడికే తెప్పించేవారు. మేము మాట్లాడుకుంటూ భోజనం చేస్తుంటే, తోట కూడా శ్రద్ధగా వింటుండేది.

ఆ దృశ్యాన్ని మనోహరం చెయ్యడానికి చంద్రుడూ, నక్షత్రాలూ వచ్చేవారు.

ఆమె చెప్పే కబుర్లు, ఆ విజ్ఞానపు స్థాయి , ఇదివరకు నేనెన్నడూ చూడలేదు. ఆమె ఆలోచనలు, మేథస్సు, ఆ వేగం అన్నీ ఆశ్చర్యమే. ఎప్పటికప్పుడు నేనెంత బావిలోకప్పనో అర్థం అవుతూ ఉండేది. ప్రతివిషయం లోనూ ఆమె స్టాండర్డ్స్ ప్రత్యేకంగా ఉండేవి. జయకూ , ఆవిడకూ ఒక్క విషయంలోనైనా ఏదైనా పోలిక దొరుకుతుందా అని చూసేదాన్ని.

చాలా సార్లు ఫోన్ చేసి మరీ పిలిచేవారు. రేపు రావాలి. నీ కోసం ఒకటి చేస్తున్నాననేవారు.

ఇంటికెళ్ళాక ఏవేవో తినిపించేవారు.

"ఎన్ని రోజులయ్యిందే నువ్వొచ్చి. నిన్న కలలోకి వచ్చావు తెలుసా."

ఎవరికైనా మనం గుర్తొస్తామనుకుంటే ఎంత బాగుంటుంది.

"తినూ" అంటూ నాకో పాయసం బౌల్ తెచ్చి ఇచ్చారు.

అటూ ఇటూ చూస్తున్నా.

"ఏంటీ చేతులు కడగాలా?"

అవునన్నట్టు తలాడించాను.

"కడిగీ కడిగీ ఆ చేతులు చూడు, కట్టె పేళ్ళులా ఎలా తయారయ్యాయో. పొయిలోకి కూడా పనికి రావు."

"ఏదైనా తినేటపుడు చేతులు కడగాలి కదండీ."

"స్పూన్ ఉంది కదా."

"అయినా సరే" అంటూ వరండాలో ఉన్న సింక్ లో చేతులు కడుక్కుని వచ్చాను. కౌచ్ లో కూర్చుని పాయసం తింటున్నాను.

ప్రతి రోజు, ఆమె వాకింగ్ కోసమని దగ్గరలో ఉన్న పార్క్ క్లబ్ కు వెళ్తారు. క్లబ్ లో వాకింగ్ మిత్రుల సంగతులు చెప్తున్నారు.

"వాసుదేవ్ చెస్ భలే ఆడతాడే. ఇన్నాళ్ళకు నాతో ఆడగలిగే ప్లేయర్ ని చూశాను. "

ఒకప్పుడు ఆవిడ స్టేట్ చెస్ ఛాంపియన్ అని జయ ఎప్పుడో చెప్పినట్టు గుర్తు.

"నేను కూడా ఆడతాను. బోర్డు, కాయలు తీసుకురండి."

"కాయలేంటే, కాయలు. అష్టా చెమ్మా అనుకున్నావా?"

"అవేలెండి. ఆ పీసెస్. ఏనుగు, గుర్రాలు, శగటులు"

"మీ నాన్న ఇంగ్లీషు పంతులైతే, నీకీ తెలుగుమాటలెట్టా వచ్చే.."

"ఇంగ్లీషు కూడా తెలుసులెండీ. నైట్ అంటే గుర్రం, రూక్ అంటే ఏనుగు. శగటుని ఏమంటారండీ."

"శగటేమిటి నీ మొహం. శకటు అది. బిషప్ అంటారు."

"సరేలెండి. తీసుకురండి, ఆడేద్దాం."

"నీకసలు ఆట వచ్చా?"

"కొద్దిగా వచ్చు. మీరాడుతూ ఉంటే అందుకుంటా."

ఆట మొదలెట్టాక, రెండునిముషాల్లో సరిగా ఆరో ఎత్తులో నా ఆట కట్టింది.

"మీ మేధస్సంతా వాడి నన్ను గెలిపిస్తారనుకున్నా. నేనంటే ఇష్టం ఇష్టం అంటారు. ఇదేనా ఇష్టం."

"మీ డాక్టర్లకు చిత్రమైన రోగముందే."

"డాక్టర్లకు రోగాలేంటండీ అసహ్యంగా!"

"మీకు తెలియని సంగతి ఉండదు. నేర్చుకోలేని విషయం అసలే ఉండదు. మీకు మీరే సర్వజ్ఞులు. ఎదుటి మనిషి ఏం చెప్పబోతున్నాడో మీకు ముందే తెలిసిపోతుంది. మాట్టాడుతుంటే మధ్యలో ఆపేస్తారు. అసలు చెప్పేది వినిపించుకోరేమే?"

"ఒకరి ముచ్చట్లే వింటూ కూర్చుంటే, మిగిలిన వాళ్ళనెప్పుడు చూస్తాము."

"మేమేం ఆలోచిస్తున్నామో కూడా మీరు చదివెయ్యగలరు. ఒక్క మాట ఎక్కువమాట్లాడినా సరే, మొహం చిట్లించుకుని, పెన్ను తలకాయలో పెట్టి గీకుతుంటారు. మీరూ, మీ వేషాలు."

నాకైతే ఆమె చెప్పిన రోగం నాలుగో స్టేజిలో ఉన్నట్టనిపించింది.

“మీరు ఆయనతో కూడా ఇలానే మాట్లాడేవారా?”

“ఆయనెవరే?”

“జయ వాళ్ళ నాన్నగారు.”

“ఆయనతో మాట్లాడిన గుర్తే లేదే.”

“మరి జయ పుట్టింది కదండీ.”

“పిల్లలు పుట్టడానికి మాట్టాడుకోవాలా? ఎవడే నీకు డిగ్రీ ఇచ్చింది?”

“ఎక్కడుంటారాయన?”

“తెలియదే ! జయని కనడానికి అమ్మగారింటికెళ్ళాను. ఆ తర్వాత అత్తగారింటికి వెళ్ళాల్సిన అవసరం లేదని చెప్పారు.”

“అదేం?”

“ఇష్టం లేని పెళ్ళిచేసినందుకు కోపంతో ఎటో వెళ్ళిపోయాడని అన్నారు. ఎందుకెళ్ళాడో, ఎటు వెళ్ళాడో తెలియదు.”

“మరి కాపురమెందుకు చేసినట్టు ?”

“కోపముంటే మాత్రం, దాహమనిపించదా? నీళ్ళు తాగరా?”

నేనేం మాట్లాడలేదు.

“నాన్న తీసుకెళ్ళి కాలేజిలో చేర్పించారు. ఉద్యోగం రావాలంటే బాగా చదువుకోవాలి అన్నారు. అవసరం , ఆకలి తోడుగా నిలబడి చదివించాయి. అవే విజయాలందించాయి. ఉద్యోగం వచ్చింది. కాలేజి ప్రిన్సిపాల్ అయేవరకూ కాలమే తెలియలేదు.”

“ఆయన అన్యాయం చేశాడన్న కోపం లేదా? ఇన్ని కష్టాలు పడినందుకు..”

“కష్టాలు, కష్టాలు అంటారు. నాకైతే ఏమీ అనిపించలేదు. నా జీవితం నేను గడిపాను. పరుగు తీశాను. పరుగులో ఆనందం ఉండేది.”

“మీరు మళ్ళీ పెళ్ళెందుకు చేసుకోలేదు.”

“ఒకరితో పెళ్ళయి, పిల్లని కని.. మళ్ళీ వేరొకరితో పెళ్ళి అంటే తప్పు కదా.”

ఆమె వంక చూశాను.

ఆ కళ్లు తప్పే కదా అంటున్నాయి.

“అంటే రెండో పెళ్ళి చేసుకున్న వారంతా తప్పు చేసినట్టా?”

“అయ్యో. అలా కాదు. వల్లి అలా చెయ్యడం తప్పు కదా అనుకున్నాను. చేసుకోకూడదనుకున్నాను. అంతే.”

“మీరిప్పుడే ఇంత చక్కగా ఉన్నారు కదా. పెళ్ళి చేసుకుంటామని ఎవరూ రాలేదా?”

“నమ్మవుగానీ, ఎవరూ రాలేదు. బాగుంటానని ఆడవాళ్ళు తప్ప మగవాళ్ళెవరూ ఇంతవరకూ అనలేదు. మొన్న మొన్నటి వరకూ నాన్న తోడుగా ఉన్నాడు. జయ చదువు, పెళ్ళి, దాని పిల్లని పెంచడం, సరిపోయింది.”

చీకటి పడింది. తోటలో లైట్లు వెలిగాయి. ఇద్దరం గది బయటికి వచ్చి వరండా లో మెట్ల మీద కూర్చున్నాం.

“పరుగు తీసే వాడికి తోడు అవసరం లేదు. పరుగు ఆపిన తర్వాతే ఒంటరినని తెలిసింది. ఇప్పుడనిపిస్తోంది. మాట్టాడుకోడానికి ఒక మనిషి అయినా లేడే అని.”

"మేమున్నాం కదండీ. మాతో మాట్లాడండి."

"ఏమ్మాట్లడను నీ తలకాయ. ఎంత సేపూ ఆ డిపార్ట్ మెంటూ, డ్యూటీలు ఇవేనా! ఆ పిల్లెవరో టైముకి డ్యూటీకి రావట్లేదనీ, వచ్చినా గంటకొక్క పేషంటుని చూస్తుందనీ, ఇవేగా మీ మాటలు"

"ఛీ వల్లిగారూ, మేమసలు గాసిప్స్ మాట్టాడుకుంటామా? డిపార్ట్ మెంట్ ఎలా రన్ చెయ్యాలో అని చర్చించుకుంటాము"

"ఓయబ్బ, డిపార్ట్ మెంట్. మీరు పాతికమంది, కనేది పదిమంది. పని తక్కువైపోయి తన్నుకు చస్తున్నారు మీరు."

"పోనీ ఎలాంటి కబుర్లు చెప్పాలో చెప్పండి. చెప్తాను."

"రేపటికల్లా పారడైజ్ లాస్ట్ చదువుకుని రా. చర్చించుకుందాం."

"అది నవలా అండీ?"

"నోర్మూసుకో గాడిదా. నవలేంటే నవల?"

"ఏదోలెండి! ఒక్కరోజులో ఎలా చదవను? చదివినా మీతో నేనేం మాట్లాడగలను."

"తెలిసిందా, ఇక నోర్మూసుకో. అందరితో అన్నీ మాట్టాడుకోలేం కదే. నీతో మాట్లాడినవి జయతో అనగలనా చెప్పు. తెలిసిన ఒక స్నేహితుడుండాలి. అతని తో మాట్లాడాలి అనిపిస్తుంది."

'స్నేహితుడు.'

ఆమె గొంతులో వినిపించిన భావానికి, మాటలు రాక అలాగే చూస్తున్నాను కన్నార్పకుండా.

"ఏంటే , గుడ్లగూబలా అలా చూస్తావూ?"

ఏం లేదన్నట్టు అడ్డంగా తలూపాను.

"ఎవరో ఒకరితో మాట్టాడుకోవాలనిపించడం తప్పంటావా?"

ఆమెకు నేనేం చెప్పగలను

అన్ని రంగాల్లోనూ మేధావి. అమాయకత్వంలో కూడా.

(ముగింపు వచ్చే సంచికలో)

COMMENTS